క్లుప్తంగా

పేదలు నివేశన స్థలాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సొంత నివాస గృహం గానీ, సొంత నివేశన స్థలం గానీ లేని నిరుపేద గృహిణులు నివేశన స్థలాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నిరుపేద గృహిణులు వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతంలోని సచివాలయంలోగానీ, స్థానిక వలంటీర్ వద్ద గానీ ఇప్పటి వరకు నివేశన స్థలాల మంజూరు కోసం పేర్లు నమోదు చేయించుకోని వారు తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు వారి అర్హతే ప్రామాణికంగా మంజూరు చేయనున్న ఇంటి స్థలాల కోసం ఏ ఒక్కరూ ఎవరికీ ఒక్క పైసా చెల్లించనక్కర లేదని వివరించారు. మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తే సెల్ 9912471247లకు మెసేజ్ చేయవచ్చునని తెలిపారు. మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో దాదాపు 25వేల మంది పేదలకు నివేశన స్థలాలు కేటాయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



తాడేపల్లి రూరల్: నగర పరిధిలోని మెల్లెంపూడిలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో గర్భిణులకు న్యూట్రిషన్, ప్రోటీన్ ఫుడ్ సప్లిమెంట్స్ అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షుడు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ రీజనల్ చైర్మన్ పబ్లిక్ ఇజేమ్ యలమంచిలి వేణుగోపాల్ జన్మదినం సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. అనంతరం గ్రామ వికాస్ ప్రాజెక్ట్ ఏరియా చైర్మన్ కొల్లా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకృష్ణ, సభ్యులు ఓబులారెడ్డి, సుకుమార్ రెడ్డి, శెట్టి కేశవరావు, రవీంద్రారెడ్డి, నాగ కిరణ్, శ్రీను, ఆర్‌సిసి మెంబర్స్ పున్నారెడ్డి, వెంకటప్పరెడ్డి, టి.పుష్పరాణి, షేక్ సుల్తానా పాల్గొన్నారు.

సప్తశతి పారాయణం సకల పుణ్య ఫలప్రదం

పాత గుంటూరు: దేవీ సప్తశతి పారాయణ సకల పుణ్యాల్ని చేకూర్చి పెడుతుందని మహా సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ తెలిపారు. సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శ్రీ దేవీ సప్తశతిపై ఆదివారం ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. నాగఫణిశర్మ ప్రవచనం చేస్తూ దేవీ సప్తశతి అమ్మవారి శక్తికి నిదర్శనం అని వివరించారు. అమ్మవారి స్తుతులు, స్తోత్రాల్ని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు పాల్గొన్నారు.

మిరప రైతు 'పంట పండింది'



పెదకాకాని: మిరప దిగుబడితో పాటు ధరలు కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. తొలి కోతలో తాలు కాయల రాశులు పెరిగి భయపెట్టినప్పటికీ రానురానూ నాణ్యతతో పెరగడంతో ధరలు నిలకడగా ఉన్నాయి. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల, పెదకాకాని, తక్కెళ్ళపాడు, రామచంద్రపాలెం గ్రామాల్లో రైతులు మిరప సాగు చేపట్టారు. ఆయా గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో పంట సాగు అవుతుంది.

హైబ్రీడ్ రకాలపై రైతుల మొగ్గు

మిరప పంట సాగు అనగానే ముందుగా రైతులకు గుర్తుకు వచ్చేది అధిక పెట్టుబడులు. పొలంలో విత్తనం నాటిన దగ్గర నుంచి ఎరువులు, పురుగుమందులు, నీటి తడుల రూపంలో అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టాలి. ఎకరానికి రూ. 2 లక్షల దాకా ఖర్చు చేయాలి. ఇటీవల సాధారణ రకాలు తెగుళ్లను తట్టుకోలేక దిగుబడి తగ్గి రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఎక్కువగా ఆర్మూరు, 275, 279, బులెట్, రోమి 2626, డీజో 355 వంటి హైబ్రీడ్ రకాలు సాగు చేశారు.

తాలు కాయలతో తొలుత నిరాశ

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మొదటి రెండు కోతల్లో తాలు కాయలతో పాటు తామర పురుగు ఎక్కువ కావడంతో రైతులు కొంత నిరాశ చెందారు. అధిక మొత్తంలో పురుగు మందులు కూడా పిచికారీ చేశారు. అయితే, ఇటీవల తాలు శాతం తగ్గడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎకరానికి 20 క్వింటాలు నుంచి 30 క్వింటాలు వరకూ దిగుబడి వస్తోంది. మార్కెట్‌లోనూ నాణ్యత బట్టి క్వింటా(100 కిలోలు) రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకూ కొనుగోలు చేస్తున్నారు. బ్యాడిగి రకాన్ని కల్లాల్లోనే రూ. 30 వేలకు పైనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సరుకు రవాణా, వ్యాపారులకు కమిషన్ వంటివి చెల్లించాల్సిన అవసరం తప్పింది. తాలు కాయలు కూడా నాణ్యత ఆధారంగా క్వింటా రూ. 8 వేల నుంచి రూ.14 వేల వరకూ పలుకుతుండటంతో రైతుల పంట పండింది.

■ స్వర్ణోత్సవ కలయిక

పెదవడ్లపూడిలో 1972–73 బ్యాచ్ సందడి



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

పెదవడ్లపూడి(మంగళగిరి): కళ్లలో శుక్లపు పొరలు కంటి చూపునకు అడ్డుపడుతున్నా.. వారి కనుపాపల్లో ఆనందాల జ్యోతులు వెలిగాయి. ఆ నడకల్లో సత్తువ మందగించినా.. ఆ వేదిక తాకగానే వారి పాదాలు నాట్యమాడాయి. తాతా అని పిలుపునకు చేరువైనా.. ఆ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆ హృదయాలు 50 ఏళ్ల వెనక్కి నెట్టాయి. ఏరా నాగేశ్వరరావు ఎన్నేళ్లయింది నిన్ను చూసి.. బాగున్నావా.. పిల్లలు ఏమి చేస్తున్నారు.. మన స్నేహితులందరూ వచ్చారా.. వాడు సుబ్బారావు కదరా బాగా మారిపోయాడు.. నువ్వు మాత్రం మారలేదురా.. అంటూ తమ చిన్న నాటి స్నేహాలను అనుబంధాలతో పాటు చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. అక్షరాలు దిద్దించిన గురువుల జ్ఞాపకాలు మదిలో మెదులుతుండగా.. బాల్యపు స్నేహ మాధుర్యాలు అక్షర కుసుమాలై పరిమళించాయి. తమ చదువుల గుడికి దాతృత్వపు హారం వేసిన అపూర్వ ఘట్టాలు పెదవడ్లపూడి జెడ్పీ పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమయ్యాయి. 1972–73 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సవాల మధ్య జరిగింది. 135 మందిలో 65 మంది హాజరు కాగా 23 మంది మృతి చెందారు. వివిధ కారణాలతో 47 మంది వివిధ కారణాలతో హాజరుకాలేకపోయారు. వివిధ రంగాలలో స్థిరపడిన ప్రముఖులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు అన్నే చంద్రశేఖర్, బొర్రా సుబ్బారావు, ఆనంద ప్రసాద్‌రెడ్డి, యేళ్ళ రాఘవయ్య, యశోద, ఆదిలక్ష్మి పర్యవేక్షించారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మంగళగిరి: నగరంలో ఆదివారం ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. పాత మంగళగిరి లూథరన్ దేవాలయం సంఘ కాపరి దాసిపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున యువతీ, యువకులు, చిన్నారులు, పెద్దలు ఈత మట్టలతో భక్తి గీతాలను ఆలపిస్తూ పురవీధుల్లో ఏసుక్రీస్తుకు జేజేలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పల్నాడు జిల్లా కారెంపూడి నుంచి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయురాలు యర్రం సరోజని దైవ సందేశం అందించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సతీష్ పాల్గొన్నారు.

నగర పరిధిలోని పార్కురోడ్డు ఇమ్మానియేలు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు ఈత మట్టలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ బొంతపూరి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘస్తులు డి.సారథి, బి.దేవరాజు, జి.సునీల్, ఎస్.సామ్రాజ్యమ్మ పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండలంలోని బాల ఏసు దేవాలయంలో మట్టల ఆదివారం పండుగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయం వెలుపల దివ్యపూజ బలి కార్యక్రమం నిర్వహించారు. మేత్రాసన గురువులు భాగ్యయ్య శ్రమ దినాలలో ఉండాల్సిన నియమాలు, భగవంతుడి ప్రార్థనలతో ఏవిధంగా జీవించాలో వివరించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు అడుగుజాడలలో నడవాలని సూచించారు. సిలువ నెత్తుకొని శ్రమదినాలలో పాలు పంచుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక దివ్యపూజాబలి నిర్వహించారు. అనేక మంది విశ్వాసులు దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అనంతరం మ్రాని కొమ్మలు అందజేశారు. కార్యక్రమంలో బాల ఏసు దేవాలయ విచారణ గురువు పామిశెట్టి బాలస్వామి, సహాయగురువు చొప్పర కిషోర్‌బాబు పాల్గొన్నారు.

నేడు ముఖ్య సంఘ కాపరుల సమావేశం

వీర్లపాలెం(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం యేసునామ క్షేత్రంలో ముఖ్య సంఘ కాపరుల ప్రత్యేక సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పాస్టర్స్ ఫెలోషిప్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నాయుడుపేటకు చెందిన కల్యాణి, ఆమె తమ్ముడు సాయి పాత కక్షల నేపథ్యంలో గతనెల 30న దరియాబీపై దాడి చేశారు. ఆమె మెడలోని బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. దరియాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలొద్దు



లక్ష్మీపురం: కీళ్ల మార్పిడి ఆపరేషన్లపై అపోహలు వద్దని, తీవ్రంగా మోకాళ్ల నొప్పులు ఉన్నవారు మిగతా జీవితాన్ని సౌకర్యవంతంగా గడిపేందుకు తప్పనిసరిగా ఆపరేషన్లు చేయించుకోవాలని సాయి భాస్కర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. బ్రాడీపేటలోని తాలుకా ఆఫీసు కార్యాలయ ప్రాంగణంలోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ ఆవరణలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో 230వ ఆరోగ్య సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అధిక బరువు, మారిన జీవన విధానంతో ఒత్తిడి, కాల్షియం లోపం, మధుమేహం రక్తపోటు వంటి కారణాలతో 50 ఏళ్లు దాటిన వారిలో కీళ్ల అరుగుదల ఉంటుందని తెలిపారు. సమస్యను గుర్తించేందుకు తప్పనిసరిగా ఎముకల వైద్యుల్ని సంప్రదించి నిర్దిష్ట పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్ అంటే భయపడి నొప్పుల మాత్రల్ని పదేపదే వాడి మూత్ర పిండాలు, గుండె జబ్బులు, కాలేయం, జీర్ణ కోశ సమస్యల బారిన పడొద్దని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న అశాస్త్రీయ పద్ధతులతో సమస్యను తీవ్రతరం చేసుకోవద్దని తెలిపారు. ఎముకల అరుగుదల మొదటి, రెండో దశల్లో వైద్యుల సూచనలతో వ్యాయామం, మందులు సరిపోతాయన్నారు. మూడు, నాలుగు దశల్లోనే శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. అనంతరం డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డితో పాటు ఆయన తండ్రి మల్లేశ్వరరెడ్డిని సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, కృష్ణయ్య, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదినారాయణ రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకో..

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్ కుమార్



తాడికొండ: స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మార్చే బీజేపీ నాయకుడు ఆదినారాయణ రెడ్డి ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడితే మంచిదని తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ హెచ్చరించారు. అమరావతి 1200వ రోజు దీక్షలలో పాల్గొని సీఎంపై ఆదినారాయణ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో రాజకీయాల్లోకి వచ్చి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆదినారాయణరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో గెలిచాడే తప్ప తనకు సొంతంగా ఆ ప్రాంతంలో అంత సీన్ లేదని హితవు పలికారు. చంద్రబాబుకు అమ్ముడుపోయి అవినీతి సొమ్ముకు అలవాటుపడిన ఆయన మంత్రిగా చేసినప్పుడు సంపాదించిన అక్రమ సంపాదనను కాపాడుకునేందుకే బీజేపీ చేరినట్లు ధ్వజమెత్తారు. తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. వికేంద్రీకరణ, మూడు ప్రాంతాల సమానాభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానులను అజెండాగా తీసుకొని 2024 ఎన్నికలకు వెళ్లేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని చెప్పారు. అమరావతి అభివృద్ధికి నిజంగా చంద్రబాబే అడ్డంకి అని ఆరోపించారు. ఈ ప్రాంతం అంతా కలిపి అమరావతి మెట్రో పొలిటన్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే తప్పుడు కేసులతో బాబు ఆయన కంపెనీ అడ్డుకుందని చెప్పారు. ఆదినారాయణ రెడ్డి సీఎంకు బహిరంగ క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సరస్వతీ మాత విగ్రహాల ఆవిష్కరణ



సరస్వతీ మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, కావటి శంకరరావు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో ఆదివారం వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు ఏర్పాటు చేసిన విగ్రహాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ మణికంఠ గుంటూరు, మహిళా శక్తి గుంటూరు సభ్యులు నగరంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని, భవిష్యత్‌లో మరిన్ని ప్రజోపయోగకరమైన పనులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీ మణికంఠ గుంటూరు సభ్యులు గోనుగుంట్ల జయంత్ కుమార్, గిరిజాశాంత ప్రసాద్, బోలిశెట్టి వెంకటేశ్వరరావు, జుజ్జూరి శ్రీనివాసరావు, మాజేటి మణికంఠ ప్రసన్న, మాజేటి స్వాతి, పారేపల్లి శ్రీనివాసరావు, పారేపల్లి మంజుల, పోలిశెట్టి నాగరాజు, పోలిశెట్టి దుర్గాభవాని, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పోతురాజు సమత, వేములపల్లి జ్యోతి పద్మజ, నిమ్మల వెంకటరమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గ మహిళా నాయకురాలు షేక్ నూరి ఫాతిమా, హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రికి వచ్చి వ్యక్తి అదృశ్యమైన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన వెన్నపూస సుబ్బారెడ్డి మార్చి 26న శంకర కంటి ఆసుపత్రి నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి వచ్చాడు. శుక్లాల ఆపరేషన్ చేయించుకునేందుకు మార్చి 28న ఆసుపత్రి ఏర్పాటు చేసిన బస్సులో గ్రామస్తులతో కలసి పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆ తరువాత ఆసుపత్రి వారు వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో బంధువులు ఎంత వెతికినా కనిపించలేదు. సుబ్బారెడ్డి అల్లుడు బాగిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఉత్సాహంగా స్కేటింగ్

గుంటూరు చానల్ వద్ద తాగునీటి పథకం ఆవరణలో నిర్మించిన స్కేటింగ్ రింక్‌లో చిన్నారులు ఉత్సాహంగా ఆదివారం స్కేటింగ్ చేశారు. నగరంలో స్కేటింగ్ రింక్ నిర్మించడం ఆనందంగా ఉందని, స్కేటింగ్ రింక్ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే ఆర్కేకు అభినందనలు తెలిపారు.

– మంగళగిరి



నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

తాడేపల్లి రూరల్: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఐదు పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్ళం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల, రేవల్లె కరకట్ట వద్ద ఉన్న గుడ్ న్యూస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక వందేమాతరం హైస్కూల్, వడ్డేశ్వరం హైస్కూల్, కుంచనపల్లిలో అరవింద్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లు కేటాయించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. 1,137 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరందరూ ఉదయం 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. 5 పాఠశాలల్లో ఇన్విజిలేటర్లుగా వేర్వేరు పాఠశాలలకు చెందిన 63 మంది ఉపాధ్యాయులను ఏర్పాటు చేశామని, అన్నారు. అలాగే పరీక్ష పత్రాలు తరలించడం, వాటిని భద్రపరిచేందుకు చీఫ్ సూపరింటెండెంట్‌లు ఉన్నట్లు వారు తెలిపారు. దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల గరల్స్, బాయిస్ హైస్కూల్, ఈమని, పెదపాలెం, రేవేంద్రపాడు, చిలువూరు గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

మేడికొండూరు మండలంలో..

మేడికొండూరు: పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సన్నద్ధం ఏర్పాటు చేశారు. మండలంలో 888 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పేరేచర్లలోని యాపిల్ హైస్కూల్, మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్, శిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్, పేరేచర్ల శింగుసీతారామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవాలయ పునః నిర్మాణం



పునఃనిర్మాణ ఆలయ నమూను చూపిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పునః నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 1975వ సంవత్సరంలో వెలసిన శ్రీ మహంకాళి అమ్మవారం ఆలయం అర్థ శతాబ్దం తరువాత పూర్తిస్థాయిలో జీర్ణోద్ధరణ జరుగనుందని, సుమారు కోటి రూపాయలు దేవదాయధర్మాదాయ శాఖ వారి సీజీఎఫ్ నిధులు, ఇతర దాతల సహకారంతో త్వరలో పనులు ప్రారంభించనున్నారని అన్నారు. దాతలు దొంతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారెల్ల పుల్లారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు నెలలకాల వ్యవధిలో ఈ ఆలయ పునః నిర్మాణ పనులు పూర్తి చేసి ఆలయ ఖ్యాతిని మరింత పెంచనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై వైభవంగా తిరుమంజన సేవ



అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి

తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం ధనలక్ష్మి, సంతాన లక్ష్మి అమ్మవార్లకు తిరుమంజన సేవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు 10 గంటలకు అష్టలక్ష్మి సమేత లక్ష్మీ నారాయణ స్వామి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ధనలక్ష్మి, సంతానలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు జరిపారు. 10 గంటలకు తొమ్మిది సన్నిధులలో గులాజీ పుష్పాలతో సహస్రనామార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద నివేదన గావించారు. కార్యక్రమంలో జీయర్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రాఘవాచార్యులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సినీ రంగ అభివృద్ధికి..ఎన్టీఆర్ కృషి మరువరానిది



టీనా చౌదరి, నాగేశ్వరరావు, రమ్యలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: సినీ రంగ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తులలో ఎన్టీ రామారావు ఒకరని ఆళ్ళ నాగేశ్వరరావు, పరుచూరి రమ్య కొనియాడారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని పెన్షనర్ హాల్‌లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై ఆదివారం సాయంత్రం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ నృత్య కళాకారిణి మన్నె టీనా చౌదరితో పాటు వక్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వర రావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, వేములపల్లి మల్లికార్జునరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, కనపర్తి మధుకర్, పినపాటి సురేష్, బొల్లినేని జ్యోతి, గడ్డిపాటి సీతారత్నం, మన్నె సత్యనారాయణ, శివకుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతారామ మందిరంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, రామాంజనేయులు

తెనాలిటౌన్: శ్రీరామ నవమి వసంత నవరాత్రులు ముగింపు సందర్భంగా హనుమాన్ చౌక్‌లోని శ్రీ సీతారామ మందిరం వద్ద ఆదివారం అన్నదానం చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీతారామ మందిరంలో పూజలు నిర్వహించారు. సహకార బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు బాలాజీ ప్రసాద్, బ్యాంకు సీఈవో టి.కృష్ణవేణి, నాబార్డు డీడీఎం కార్తిక్, అన్నదాన కమిటీ చైర్మన్ పిన్నిక శేషభానురావు, బ్యాంకు ఆఫీసర్ ప్రత్తిపాటి రమేష్, దుగ్గిరాల చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, బ్యాంకు అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం



పెదకాకాని: వెనిగండ్ల శివారు అగతవరప్పాడు రోడ్డులో జన చైతన్య సంస్థ ఆధ్వర్యంలోని షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. వేడుకల్లో మందిర చైర్మన్ మాదాల రత్నగిరిబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ హోమం నిర్వహించారు. తొలుత శ్రీ షిర్డీ సాయి నాథుడిని పల్లకీలో ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో జన చైతన్య సంస్థల అధినేత్రి మాదాల శకుంతలమ్మ, కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు కూరపాటి శివప్రసాద్, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.